


మామిళ్లకుంట కూడలిలోని లలితాంబ అమ్మవారు


ప్రశాంతి నిలయంలో బాలాత్రిపురసుందరిగా గాయత్రీమాత

జగజ్జననీ.. పాహిమాం..!

జిల్లావ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం

పుట్టపర్తి రూరల్/లేపాక్షి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీలు ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించాయి. ప్రశాంతి నిలయంలోని గాయత్రీ అమ్మవారి ఆలయాన్ని, జిల్లా కేంద్రంలోని సత్యమ్మ దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. పుట్టపర్తిలో గాయత్రీ అమ్మవారు, మామిళ్లకుంటలో లలితాంబ అమ్మవారు, కోవెలగుట్టపల్లిలో దుర్గాదేవి అమ్మవారు, పట్టణంలోని గ్రామదేవత సత్యమ్మ అమ్మవారు వివిధ అలంకరాల్లో దర్శనమిచ్చారు, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాల్లో అమ్మవారికి ప్ర త్యేక అలంకరణ చేశారు. ఉదయాన్నే అభిషేకం, అర్చన గావించి, సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. లేపాక్షిలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో ఆ లయ కమిటీ చైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో తొలిరోజు సోమవారం దుర్గాదేవిని బాలత్రిపురసుందరిదేవి అలంకరించారు. అ నంతరం ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.


లేపాక్షిలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి


కోవెలగుట్టపల్లిలో దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణ


పుట్టపర్తిలో అమ్మకానికి సిద్ధంగా నూతన ద్విచక్రవాహనాలు

ప్రతి ఇంటికీ పండగ

GST

జీఎస్టీ తగ్గింపుతో దిగొచ్చిన ధరలు

వాహనాలు, నిత్యావసరాల కొనుగోలుకు జనం ఆసక్తి

దుకాణాలు, షోరూంలు కిటకిట

బుకింగ్, డెలివరీలతో బిజీ బిజీ

కేంద్రం నిర్ణయంపై సర్వత్రా హర్షం

పుట్టపర్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ధరల తగ్గుదలతో ప్రతి ఇంటికీ పండగొచ్చింది. వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలు సోమవారం అమలులోకి వచ్చాయి. అందులో భాగంగా పన్ను తగ్గింపుతో ధరలు బాగా తగ్గాయి. ఈరోజు కోసం ఎదురుచూస్తున్న జనం ఒక్కసారిగా వాహనాల షోరూంలు, దుకాణాలు, మార్ట్‌లకు పోటెత్తారు. ఆహార పదార్థాలు మొదలుకుని విద్యార్థులకు సంబంధించి పెన్సిళ్లు, క్రెయాన్స్, గృహోపకరణాలు, బైక్‌లు, కార్లు, ఎయిర్ కండీషనర్లు (ఏసీ), టీవీలు, వాషింగ్ మిషన్లు, ఔషధాల ధరలు సైతం తగ్గించారు. అన్ని రంగాలకు చెందిన 375 రకాల వస్తువుల ధరలు తగ్గాయి. ఇదివరకు 5, 12, 18, 28 శాతంతో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ పన్ను ఇకపై 5, 18 శాతానికే పరిమితం చేశారు. 12 శాతం ఉన్న వాటిని 5 శాతానికి, 28 శాతం ఉన్న పన్నును 18 శాతానికి కుదించారు. ఏసీలు, వాషింగ్ మిషన్లు, టీవీలపై రూ.4నుంచి 5వేల వరకు తగ్గనున్నాయి. ఆటోమొబైల్ రంగమైన వాహనాలను 28 నుంచి 18 శాతానికి తగ్గించడంతో ధరలు బాగా దిగొచ్చాయి. దీంతో ఎక్కువ మంది తొలుత వాటిపైనే ఆసక్తి చూపుతున్నారు. ధరల తగ్గుదలపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం ఎంతో ఉపశమనాన్నిస్తోందంటున్నారు.

మా ఇంటికి పండగొచ్చింది

కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో కొన్ని నెలలుగా టీవీ కొనుగోలు చేయాలని చూస్తున్న నాకు ముందే పండుగ వచ్చినట్టయింది. 43 ఇంచుల ఎల్ఈడీ టీవీ కొనుగోలు చేయాలన్నాకున్నా. ఈరోజు పెనుకొండలోని ఓ దుకాణంలో వెళ్లి కొత్త టీవీ ధరలు ఆరాతీశా. గతంలో రూ.35వేలు ఉండే టీవీ ధర ప్రస్తుతం రూ.3500దాకా తగ్గింది. రేపో.. మాపో.. టీవీ కొనుగోలు చేసి, దసరా పండుగకు ఇంటికి తీసుకెళ్తా. జీఎస్టీ తగ్గింపుతో మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కల్గింది.

- భార్గవ్, కార్మికుడు, పెనుకొండ



బైక్‌లు, కార్లపై తగ్గుదల ఇలా...

బైక్‌లపై 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించారు. ఆ మేరకు బైక్‌ల ధరలు రూ.10 వేల వరకు తగ్గాయి. కార్లపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న మోడల్‌ను బట్టి రూ.40వేల నుంచి రూ.1.90 లక్షల వరకు ధరలు తగ్గాయి.

టీవీలు, వాషింగ్ మిషన్లు...

ఇళ్లలో ఉపయోగించే ఎలక్ట్రికల్ వస్తువులు ఇతర సామగ్రిపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. కంపెనీలు, షాపింగ్‌మాల్స్ దుకాణాల్లో దసరా ఆఫర్ ప్రకటించారు. దీంతో ఈ వారం రోజులు టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్లు, ఏసీలు, వంటగదికి సంబంధించిన వస్తువుల కొనుగోలుకు పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఈ వారం రోజులు అవన్నీ సందడిగా మారుతాయనడంలో సందేహం లేదు.

తొలిరోజే కిటకిటలాడిన షోరూంలు...

కొన్ని రోజులుగా ఎదురు చూసిన 22వ తేదీ ఎట్టకేలకు వచ్చింది. దీంతో బైక్‌లు, కార్ల షోరూంలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి వినియోగదారులు అధిక సంఖ్యలో వచ్చారు. బైక్ షోరూంలలో వాహనాల మోడల్, ధర, గతంతో పోల్చితే ఎంత తగ్గింది..? లాంటి వివరాలు ఆరాతీసే వారితో పాటు ముందుగా ప్లాన్ చేసుకున్న తమకు నచ్చిన వాహనాల కొనుగోలు కోసం వచ్చిన వారితో షోరూంలు సందడిగా కనిపించాయి. కార్ల షోరూంలలో ట్రయల్ రన్ కోసం వచ్చిన వారు, బుకింగ్ చేసుకుంటున్నవారు, డెలివరీ తీసుకునే (మిగతా 7లో...)



కొనుగోళ్లు ఊపందుకుంటాయి

జీఎస్టీ తగ్గింపుతో అన్ని ద్విచక్రవాహనాలపై పదివేల దాకా ధరలు తగ్గించాం. సోమవారం తగ్గిన ధరలు అందుబాటులోకి తీసుకొచ్చాం. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకుంటాయని ఆశిస్తున్నాం.

-షేక్ ఖాసీం, ద్విచక్రవాహన షోరూం నిర్వాహకుడు, కొత్తచెరువు



మధ్యతరగతి ప్రజలకు మేలు..

జీఎస్టీ తగ్గించడంతో మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతోంది. నేను టీవీఎస్ రైడర్‌ను కొనుగోలు చేశాను. దీని ధర రూ.1,00,500 ఉండేది. ఈ రోజు రూ.92 వేలకు కొన్నాను. చాలా సంతోషంగా ఉంది. గతంలో వాహనం కొనుగోలు భారంగా ఉండేది.

-లిఖిత్, మడకశర



చాలా సంతోషం..

జీఎస్టీ తగ్గింపుతో టీవీఎస్ ఎక్సెల్ కొనుగోలు చేశారు. దీని ధర రూ.60,944 ఉండేది. ప్రస్తుతం రూ.56 వేలకు తగ్గింది. జీఎస్టీ తగ్గడంతో మాలాంటి మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. ఎంతో మంది సొంత వాహనాల కల నెరవేరుతుంది.

- అబ్దుల్లా, బి.రాయపురం, మడకశిర మండలం

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


వృద్ధురాలి అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 243 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగురాలి వద్దకు వెళ్లి కలెక్టర్ స్వయంగా ఆమె సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి, అర్జీదారులు సంతృప్తిపడేలా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణ, ఆర్డీవో సువర్ణ, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

రెండు ఎకరాలిస్తేనే పాసు పుస్తకం ఇస్తారట

● గోరంట్ల తహసీల్దార్‌పై వృద్ధురాలి ఫిర్యాదు

'సార్..! పట్టా పాసు పుస్తకం అడిగితే మా తహసీల్దార్ మారుతీ ప్రసాద్ రెండు ఎకరాల భూమి తనకు రాసివ్వాలని అడుగుతున్నాడు' అని గోరంట్ల మండలం మర్రిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీనరసమ్మ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. బాధితురాలు మాట్లాడుతూ మర్రిరెడ్డిపల్లి గ్రామం తమకు పూర్వీకుల భూమి సర్వేనెంబర్ 608/2సిలో 26 ఎకరాలు ఉందన్నారు. ఇందులో తన భాగానికి 13ఎకరాలు వస్తుందన్నారు. ఈ భూమికి సంబంధించి వివాదం ఉండటంతో ఆర్డీవో కోర్టును ఆశ్రయించానన్నారు. తనకు 13 ఎకరాల భూమికి సంబంధించి హక్కులున్నాయని, పట్టదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని ఆర్డీవో కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే ఈ ఉత్తర్వులను అమలు పరచడంలో తహసీల్దార్ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె కలెక్టర్ వద్ద వాపోయారు. తహసీల్దార్ తనవద్దకు మధ్యవర్తులను పంపి రెండు ఎకరాల భూమి తాను చెప్పిన వారి పేరున రాసిస్తే, పాసుపుస్తకం ఇస్తానని చెప్పారన్నారు. దిక్కుతోచక ఇక్కడకు వచ్చినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

● గోరంట్ల మండలంలోని గుమ్మయ్యగారిపల్లికి చెందిన రైతు ఫక్రుద్దీన్ పట్టాదారు పాస్‌పుస్తకం కోసం తహసీల్దార్ రూ. రెండు లక్షలు లంచం అడిగారని ఫిర్యాదు చేశారు. ఇదే మండలంలోని బెల్లాల గ్రామానికి చెందిన తలారి క్రిష్టప్ప అనే రైతు భూమి పరిహారానికి తహసీల్దార్ డబ్బులు డిమాండ్ చేశారన్నారు. ఈఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్ పూర్తి విచారణ చేసి, నివేదిక సమర్పించాలని ఆర్డీవో సువర్ణను ఆదేశించారు.

చట్టపరిధిలో సమస్యలు పరిష్కరిస్తాం: ఎస్పీ


దివ్యాంగుల వద్దకే వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో విచారణ జరిపి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నడవలేని దివ్యాంగుల వద్దకే ఎస్పీ వెళ్లి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు చట్టపరిధిలో సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ఫిర్యాదుదారులను గౌరవంగా చూడాలని సూచించారు. మొత్తంగా కార్యక్రమానికి 85 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భూసమస్యలు, సైబర్ మోసాలు వంటివాటిపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, సీఐ సురేష్ పాల్గొన్నారు.

ఆశలు రద్దు..!



పేదల సొంతింటి కలపై నీళ్లు

వైసీపీ హయాంలో మంజూరు

ఆర్థిక సమస్యలతో కట్టుకోలేకపోయిన కొందరు

ప్రస్తుతం నిర్మించుకునేందుకు ఆసక్తి

రద్దయ్యాయని చెబుతుండటంతో షాక్

నల్లమాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకులు.. పేదల సొంతింటి కలపై నీళ్లు చల్లారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో నిరుపేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పట్లో ఆన్‌లైన్‌లో ఇళ్లు మంజూరు చేశారు. వారిలో కొంతమంది నిర్మించుకున్నారు. వారికి అరకొరగా బిల్లులు మంజూరయ్యాయి. మరికొందరు ఆర్థిక సమస్యలు, ఇతర కారణాలతో కట్టుకోలేకపోయారు. వారికి మంజూరైన ఇళ్లను గత వైసీపీ పాలకులు రద్దు చేశారు. అలాంటి వారు ప్రస్తుతం ఇల్లు కట్టుకునేందుకు ముందుకొస్తున్నారు. అధికారులను సంప్రదిస్తే ఇల్లు రద్దయిందనీ, కొత్తగా మంజూరుకాదని చెబుతుండడంతో నిరుపేదలు షాక్‌కు లోనవుతున్నారు. ఇదేం చోద్యం అంటూ వాపోతున్నారు.


నల్లమాడలోని హౌసింగ్ ఏఈ కార్యాలయం

జగనన్న కాలనీలు నిర్మిస్తామంటూ..

వైసీపీ హయాంలో అప్పటి పాలకులు.. జగనన్న కాలనీలు, ఊర్లు నిర్మిస్తామంటూ హామీలు గుప్పించారు. ప్రభుత్వమే ఇల్లు కట్టించి, ఇస్తుందంటూ గొప్పలు చెప్పారు. వీటిని నమ్మి నిరుపేదలు పెద్దఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తర్వాత మాట మార్చారు. అందరికీ ఉచితంగా ఇళ్లు కట్టించి ఇవ్వమంటూ షాక్ ఇచ్చారు. కొందరికే కట్టిస్తామన్నారు. ఎవ్వరికీ ఫ్రీగా కట్టించిన దాఖలాల్లేవు. అప్పటి పాలకుల మాటలు నమ్మి, మోసపోయిన వారు సొంతంగా ఇల్లు కట్టుకునే స్థోమతలేక మిన్నకుండిపోయారు. ఇంటి నిర్మాణం ప్రారంభించలేదు కూడా. పనులు చేయలేదని వైసీపీ హయాంలో మంజూరైన ఇళ్లను రద్దు చేశారు. ఇలా మండలంలో ఏకంగా 642 ఇళ్లు తొలగించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆ విషయం లబ్ధిదారులకు కూడా తెలీదు. కూటమి ప్రభుత్వం ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో వైసీపీ హయాంలో కట్టుకోలేకపోయినవారు ఇప్పుడైనా సొంతింటి కల నెరవేర్చుకుందామని ముందుకొస్తున్నారు. ఆ మేరకు ఇల్లు కట్టుకుంటామంటూ అధికారులను సంప్రదిస్తుంన్నారు. ఆన్‌లైన్‌లో ఇల్లు రద్దయిందని అధికారులు చెబుతుండడంతో నిరుపేదలు ఖంగు తింటున్నారు. ఇప్పట్లో మంజూరు కాదని చెబుతుండడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ఇల్లు మంజూరు చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు.



ఇళ్లు కట్టకనే రద్దయిందట..

వైసీపీ హయాంలో ఇల్లు మంజూరైంది. ఆర్థిక ఇబ్బందులతో నిర్మించుకోలేకపోయా. ప్రస్తుతం ఇల్లు నిర్మించుకుందామని అధికారులను సంప్రదిస్తే రద్దయిందని అంటున్నారు. ఇల్లు మంజూరు చేసి, ఆదుకోవాలి.

- బుట్టి పార్వతమ్మ, కొండ్రవారిపల్లి



ఇల్లు మంజూరు చేస్తే కట్టుకుంటాం

వైసీపీ హయాంలో నాకు ఇల్లు మంజూరు చేశారు. నిర్మించుకోలేకపోయా. ప్రస్తుతం ఇల్లు కట్టుకుంటానని అధికారులను అడిగితే రద్దవడంతో కొన్నేళ్ల పాటు మంజూరుకాదని చెబుతున్నారు. ఇల్లు మంజూరు చేస్తే నిర్మించుకుంటాం.

- డేరంగుల కిష్టమ్మ, చెరువువాండ్లపల్లి

రద్దయిన వాటిని పరిశీలిస్తున్నాం

బిల్లులు రాని, రద్దయిన ఇళ్ల సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో మంజూరై, కట్టుకోనివాటిని రద్దు చేశారు. నివేదికలు తయా రు చేసి, ఉన్నతాధికారులకు పంపుతాం.

-యశ్వంత్‌కుమార్, ఏఈ, హౌసింగ్

గ్రంథాలయాలను ఆధునికీకరించండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి 6

ఖాళీ కుర్చీలే డాక్టర్లు..!

● వేళకురాని వైద్యులు ● పెద్దాస్పత్రి, సూపర్ స్పెషాలిటీలో రోగుల అవస్థలు

వానొచ్చినా ఆగదు

● 25న అమరావతిలో మెగా డీఎస్సీ సభ
● ఎంపికైన ప్రతి ఒక్కరూ హాజరు కావాలి
● బస్సులు, భోజనం ఏర్పాట్లు పక్కాగా ఉండాలి
● విద్యాశాఖాధికారులకు కమిషనర్ ఆదేశం 7

యువకుడి అనుమానాస్పద మృతి 7



ప్రత్యేక రైలు తిరుపతి వరకు పొడిగింపు



గోకళం..!

● గోకులం షెడ్లతో మూగజీవాలకు రక్షణ ● తప్పిన విషసర్పాలు, క్రిమికీటకాల బెడద ● అభివృద్ధి చెందుతున్న పాడి



గోకులం షెడ్డులో ఉన్న పశువులు

శింగనమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లు.. పాడి ఉత్పత్తికి తోడ్పడుతున్నాయి. మూగజీవాలకు రక్షణ కల్పిస్తున్నాయి. విష సర్పాలు, క్రిమికీటకాల బెడద తప్పింది. షెడ్లు అనువుగా ఉండడంతో రైతులు.. మరిన్ని పాడి పశువులు కొనుగోలు చేస్తున్నారు. అలా.. మండలంలోని సోదనపల్లి పంచాయతీలో పాడి పశువుల సంఖ్య పెరుగుతోంది. పాడి పరిశ్రమకు పూర్వ వైభగం తీసుకురావాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేసింది. సోదనపల్లి పంచాయతీకి మెదట 20 షెడ్లు మంజూరయ్యాయి. పంచాయతీలోని సోదనపల్లి, ఈస్టు నరసాపురంలో పాడి రైతులు నెలలోపే వాటి నిర్మాణాలు పూర్తి చేశారు. రెండో విడతలో మరో 10 గోకులం షెడ్లు రావడంతో రైతులు వాటిని పూర్తి చేశారు.

అర్హులందరికీ షెడ్లు మంజూరు చేస్తాం:

- సౌభాగ్య, ఏపీఓ, శింగనమల

మండలంలో అర్హత గల ప్రతి రైతుకు గోకులం షెడ్డు మంజూరు చేస్తాం. సోదనపల్లి పంచాయతీలో షెడ్లు నిర్మించుకోవడానికి రైతులు ముందుకొస్తున్నారు. ఇంకా దరఖాస్తులు చేసుకుంటున్నారు. అర్హులైన వారికి మంజూరు చేస్తాం.



సోదనపల్లిలో నిర్మించిన గోకులం షెడ్డు

వ్యాధుల నుంచి రక్ష



గోకులం షెడ్డులో ఉంచుతుండడంతో మూగజీవాలకు వ్యాధులు సోకట్లేదు. గతంలో పశువులు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. రానురాను వాటి సంరక్షణ భారం కావడంతో విక్రయించాం. ప్రస్తుతం పాడి షెడ్డు అనువుగా ఉండడంతో ఉన్నవాటికి తోడు మరిన్ని పశువులు కొనుగోలు చేస్తున్నాం.

- రైతు లక్ష్మీనారాయణ

విషసర్పాల భయం లేదు



పశువులను రాత్రిళ్లు ఆరు బయట దొడ్లలో కట్టేయాలంటే భయంగా ఉండేది. పాము, క్రిమికీటకాలు, దోమకాటుతో పశువులు అనారోగ్యం బారినపడి, మృతిచెందేవి కూడా. గోకులం షెడ్డు నిర్మించుకోవడంతో ఆ ముప్పు తప్పింది. గోకులం షెడ్డు చాలా ఉపయోగకరం.

- రైతు వరప్రసాద్

పాడిపరిశ్రమ అభివృద్ధికి బాట



గ్రామాల్లో గతంలో పాడి పశువులు గణనీయంగా ఉం డేవి. కాలక్రమేణా పాడి పరిశ్రమ అంతరించిపోవడంతో పాలు, పెరుగు కూడా అంగట్లో కొనుగోలు చేశాం. ప్రస్తుతం గోకులం షెడ్డు కట్టుకోవడంతో మళ్లీ పశువులు కొనుగోలు చేసి, పెంచుతున్నాం. మళ్లీ పూర్వ వైభవం వస్తోంది.

- రైతు రమేష్

జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరచిన ఎన్‌సీసీ క్యాడెట్లతో వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురంరూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్‌లో జేఎన్‌టీయూ ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభచాటారు. కళాశాలకు చెందిన ప్రణతి, అఖిల, సౌజన్య, నఫియా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డైరెక్టరేట్ తరపున పాల్గొన్నారు. ఈనెల 1 నుంచి 12 వరకు సైనిక్ క్యాంప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రణతి, సౌజన్యలు దూరం నిర్ణయించడం, ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో పాల్గొన్నారు. అఖిల, నఫియా మ్యాప్ రీడింగ్ విభాగంలో ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా ఆరో స్థానం సాధించారు. వీరిని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ శారద అభినందించారు.

సెలవుల్లో స్కూళ్లు నడిపితే చర్యలు

● డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురంవిద్య, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో పాఠశాలలు నడిపితే చర్యలు తప్పవని డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఓ పకటనలో హెచ్చరించారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల అక్టోబరు 2 వరకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించినట్లు వెల్లడించారు. అయినా కొందరు ఇంకా పాఠశాలలు నడుపుతున్నారనే ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో స్కూళ్లను నడిపితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సెలవులు వినియోగించుకునే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు చూడాలని డీఈఓ సూచించారు.

వేప చెట్టును ఢీకొన్న ఐచర్

కోటపల్లి రైతు మృతి



నరేష్(ఫైల్)

తనకల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దండువారిపల్లి సమీపంలో సోమవారం ఐచర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తనకల్లు మండలం కోటపల్లి గ్రామానికి చెందిన నరేష్(34) మృతిచెందాడు. నరేష్ వ్యవసాయంతోపాటు ఐచర్ వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేవాడు. వేరే రైతు పండించిన టమోటాలను కర్ణాటకలోని కోలార్ మార్కెట్‌కు తరలించాడు. తిరిగి వస్తుండగా దండువారిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనా న్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న వేప చెట్టును ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖాళీ కుర్చీలే డాక్టర్లు !

● వేళకు విధులకురాని వైద్యులు
● పెద్దాస్పత్రి, సూపర్ స్పెషాలిటీలో రోగుల అవస్థలు

● ఆస్పత్రి అంటే... చిన్న కథకాదు

ఆంధ్రజ్యోతి విజిట్



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న జీర్ణకోశ శస్త్రచికిత్స ఓపీ, డాక్టర్ కోసం నిరీక్షిస్తున్న రోగులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్లు డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారు. వేళకు విధులకు రాకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులేమో కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ అని వెళ్లిపోయారు. ఇదే అదనుగా డాక్టర్లు, సి బ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యం లో వైద్యం కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవీ సోమవారం 'ఆంధ్రజ్యోతి విజిట్'లో కనిపించిన కొన్ని దృశ్యాలు. అనారోగ్యంతో నగరంలోని ఈ రెండు ఆస్పత్రులకు వస్తే డాక్టర్లు, సిబ్బందితోపాటు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు లేకపోవడంతో రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓపిక ఉండాల్సిందే..

ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఓపిక ఉండాల్సిందే. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసాల కోర్చి ఉదయమే ఆస్పతికి చేరుకుని, డాక్టర్ల కోసం నిరీక్షిస్తున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఓపీ విభాగంలో రెండు మూడు గదుల్లో డాక్టర్ల టేబుళ్లు, కుర్చీలు ఖాళీగా కనిపించాయి. మరికొన్ని ఓపీల్లో జూనియర్ డాక్టర్లు చూస్తున్నారు. సీనియర్ డాక్టర్లతో సమస్యలను చెప్పుకుందామంటే వారెప్పుడు వస్తారో, పోతారో తెలియని పరిస్థితులు ఉన్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో వీల్‌చైర్, స్రెచర్‌ల కొరత ఉండటంతో ఒక్కోదానిపై ఇద్దరు, ముగ్గురు రోగులను తరలిస్తున్నారు. కొందరిని కుటుంబసభ్యులే భుజాలపై ఆయా విభాగాలకు చేరుస్తున్నారు.



సర్వజన వైద్యశాలలో ఆర్థోవిభాగం ఓపీలో ఖాళీగా ఉన్న కుర్చీ, రోగులకు సర్దిచెబుతున్న సిబ్బంది

జాగ్రత్తలు తీసుకుంటాం

- డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్

రోగులు ఇబ్బందిపడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. సోమవారం ఓపీ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. మూడువేల మందికిపైగా రోగులు వస్తున్నారు. వీరికి సరిపడా స్ట్రెచర్స్, వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచుతాం. డ్యూటీల్లోలేని డాక్టర్లపై చర్యలు తీసుకుంటాం. సిబ్బంది, సెక్యూరిటీని సమకూర్చుతాం. సోమవారం కావడంతో అడ్మినిస్ట్రేటర్‌తోపాటు నేనూ గ్రీవెన్స్‌కు వెళ్లాల్సి వస్తోంది.

మూట చెనిక్కాయలిస్తే ఓర్వలేదు..
అందుకే.. ఆస్తి కావాలి..!

గ్రీవెన్స్‌లో సోదరులపై అక్కాచెల్లెళ్ల ఫిర్యాదు



అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వీరిద్దరూ అక్కచెల్లెల్లు. పేర్లు.. సత్యమ్మ, భ్రమరాంబ. సమస్య ఏమిటని అధికారులు అడిగితే.. 'మేము అనంతపురంలో ఉంటున్నాం. మా అమ్మపేరు వెంకటమ్మ. తనకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు బిడ్డలం. కొడుకులు చూసుకోవడం లేదని మా అమ్మ మా వద్దే ఉంటున్నారు. రాప్తాడు మండలం పాలచెర్లలో మా అమ్మకు పొలం ఉంది. ఆ భూముల కౌలు డబ్బులు, ప్రభుత్వ పథకాలు డబ్బులను మా సోదరులే తీసుకుంటున్నారు. అయినా మేము పట్టించుకోలేదు. మా అమ్మ వృద్ధాప్యంలో, కదలలేని స్థితిలో ఉన్నారు. అయినా వారికి దయ లేదు. ఇటీవల కౌలు రైతు మాకు ఒక మూట చెనిక్కాయలు ఇచ్చారు. ఆ విషయం తెలిసి మా సోదరులు రగిలిపోతున్నారు. మాకు ఆ మాత్రం కూడా ఇవ్వకూడదట. అందుకే మా అమ్మ భూమిలో మాకూ వాటా కావాలి. దయచేసి న్యాయం చేయండి..' అని విన్నవించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కలెక్టరేట్

గ్రంథాలయాలను ఆధునికీకరించండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సమస్యలను ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సోమవారం ప్రస్తావించారు. ఆధునిక దేవాలయాలైన గ్రంథాలయాలను డిజిటలైజ్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల్లో పనిచేసే సిబ్బంది జీతాలకు తగినంత గ్రాంటు ఇవ్వడం లేదని అన్నారు. స్థానిక సంస్థల నుంచి వచ్చే పన్ను ఆదాయాన్ని గ్రంథాలయాల నిర్వహణకు కేటాయించాల్సి వస్తోందని, దీనివల్ల గ్రంథాలయాల అభివృద్ధి ఆగిపోతోందని అన్నారు. ఖాళీగా ఉన్న లైబ్రేరియన్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంటు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాలను ఆధునికీకరించాలని ఎమ్మెల్యే కోరారు. యువతకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాల ధరలు మార్కెట్‌లో అధికంగా ఉన్నాయని, వీటి ధరలను ప్రభుత్వమే నిర్ణయిస్తే బాగుంటుందని అన్నారు. ఈ సమస్యలపై మంత్రి నారా లోకేశ్ బదులిచ్చారు. ఎమ్మెల్యే తెలియజేసిన సమస్యలపై అధికారులతో చర్చించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఆర్డీటీ మా జిల్లాలకు వరం

● ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి
● అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం ఉమ్మడి జిల్లాకు ఆర్డీటీ సంస్థ ఒక వరమని, అలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేసి కాపాడాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆమె మాట్లాడుతూ ఐదు దశాబ్దాలకుపైగా ఉమ్మడి అనంత జిల్లాలోనే కాకుండా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 152 మండలాలు, 4 వేల గ్రామాల్లో 5 లక్షల కుటుంబాలకు ఆర్డీటీ ద్వారా సేవలందుతున్నాయన్నారు. సుమారు 20 లక్షల మందికిపైగా ఈ సంస్థపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వైద్యం, విద్య, వ్యవసాయం, గృహ నిర్మాణాలు, క్రీడలపరంగా సంస్థ సేవలందిస్తోందన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకపోవడం వల్ల కీలకమైన సేవలు ఆగిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై జిల్లా టీడీపీ నాయకులు, రాష్ట్ర ఎంపీల సహకారంతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని కలిసి విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అందుకే అసెంబ్లీ సభ ద్వారా కేంద్రానికి ప్రతిపాదన పంపించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

రైతులను ఆదుకోండి

జిల్లాలో వర్షాధారంగానే ఏడు లక్షల హెక్టార్ల వరకూ పంటలు సాగవుతాయని, ప్రతి ఏటా అతివృష్టి లేదా అనావృష్టి మూలంగా జిల్లా రైతాంగం పంటలు నష్టపోతున్నట్లు సభలో పేర్కొన్నారు. ప్రతి ఏటా పంటలు వేయడమే తప్పా లాభం తీసుకున్న సందర్భాలే లేవన్నారు. కనీసం పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వర్షాలు సకాలంలో రాక పంటలు వేయలేకపో యారన్నారు. అరకొరగా విత్తనం వేసినా వర్షాలు లేక ఎండిపోయింద న్నారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ బీమా వ్యవస్థను నాశనం చేసిందని మండిపడ్డారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది, ఆముదం పంటలు వేస్తున్నారని, ఇందుకు ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరారు. మార్కెటింగ్ శాఖ ద్వారా టమోటా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా సహకారం అందించాలని ఆమె ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ. 50 వేలు ఇస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పరిటాల సునీత ధన్యవాదాలు తెలిపారు.

ఆర్డీటీ సేవలు అత్యవసరం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



శింగనమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఆర్డీటీ సేవలు అత్యవసరమని, ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేసి ఇబ్బందులు తీర్చాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. శాసనసభ సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ద్వారా లక్షల మంది పేద వర్గాలకు విద్య వైద్యం సదుపాయంతో పాటు వ్యవసాయ రంగంలో సహకారం అందుతోందన్నారు. ఆర్డీటీ ద్వారా వేలాది మంది జీవనోపాధి పొందుతున్నట్లు వివరించారు. ఆర్డీటీని కాపాడే దిశగామంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ఎంపీలు ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి, సమస్యను వివరించినట్లు తెలిపారు. ఆర్డీటీకి శాశ్వత పరిష్కారం చూపేలా కేంద్రంతో రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.





పంట దిగుబడి బాగుండటంతో ఏటికేడు అరటి సాగు తాడిపత్రి ప్రాంతంలో పెరుగుతోంది. అయితే ధర నిలకడగా ఉండకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. నెల కిందట టన్ను 15వేల నుంచి రూ.20వేల వరకు ఉండేది. ప్రస్తుతం సగానికి పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే తెచ్చిన అప్పులు, వాటికి వడ్డీలు ఎలా కట్టేది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి, తాడిపత్రి

అరటికి రేటు ఏదీ..?

● భారీగా తగ్గిన ధర
● టన్ను రూ.7వేల నుంచి రూ.10వేలలోపే..
● ఆందోళనలో అన్నదాతలు

వేల హెక్టార్లలో సాగు

తాడిపత్రి ప్రాంతంలో దాదాపు 8 వేల హెక్టార్ల భూమిలో అరటి సాగవుతోంది. పుట్లూరు మండలంలో అత్యధికంగా అరటి సాగు చేస్తున్నారు. తాడిపత్రి మండలంలో 50హెక్టార్లు, పుట్లూరు మండలంలో 4500 హెక్టార్లు, యల్లనూరు మండలం 900హెక్టార్లు, యాడికి మండలం 800హెక్టార్లు, పెద్దపప్పూరు మండలం 1100హెక్టార్లలో అరటిసాగులో ఉంటోంది. ఈ ఏడాది అదనంగా మరికొన్ని హెక్టార్లు సాగులోకి రానుంది. ఎకరా అరటి సాగుకు దాదాపు రూ.లక్షకు పైగానే పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అరటి మొక్క 9నెలల తర్వాత గెలలు వేయడం ప్రారంభం అవుతుంది. దిగుబడి, ధర బాగుంటే రైతుల కష్టాలు తీరుతాయి లేకుంటే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు కుప్పలవుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి ఘటనలతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.

టన్ను రూ.10వేలలోపే..

గతనెలలో అరటి ధర టన్ను రూ.20వేలకు పైగా పలకడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. దీంతో అప్పులు చేసి మరింత భూమిలో అరటిపంట సాగు చేశారు. అయితే ప్రస్తుతం టన్ను అరటి ధర రూ.10వేల కంటే దిగువకు చేరింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాదని అరటి రైతు వాపోతున్నాడు. ఆగస్టు నెలలో టన్ను రూ.30వేల వరకు పలికింది. కానీ ఉన్నట్లుండి రూ.పదివేల కిందికి రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మహారాష్ట్ర ఎఫెక్ట్

మహారాష్ట్రలో ముందస్తుగా అరటి సాగు చేయడంతో ప్రస్తుతం పంట మార్కెట్‌లోకి వస్తోంది. వ్యాపారులు అక్కడ దొరికే పంటనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో తాడిపత్రి ప్రాంతానికి వర్తకుల తాకిడి లేకుండాపోయింది. అందుకే అరటి ధర తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. సాధారణంగా తాడిపత్రి ప్రాంతం నుంచి ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలకు అరటి పంటను ఎక్కువగా రవాణా చేస్తారు. ఇందులో కూడా మహారాష్ట్రదే సింహభాగం. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోని మార్కెట్లకు కూడా రవాణా చేస్తారు. కానీ ఆయా రాష్ట్రాల్లో అరటి దిగుబడులు ఎక్కువగా రావడంతో ఏపీ వైపు వ్యాపారులు రావడం లేదని సమాచారం. ఇతర రాష్ట్రాల్లో మంచి దిగుబడితోపాటు వ్యాపారుల సిండికేట్ కూడా ధర పతనానికి కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో వ్యాపారులు, దళారీలు అడిగిన ధరకే పంటను విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

దళారుల వల్ల నష్టపోయా



ఈ ఏడాది పంట దిగుబడి బాగుందని సంతోషించేలోపే దళారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారు. గత ఏడాది ధరలు ఉన్నప్పటికి ప్రకృతి వైపరీత్యానికి అరటి చెట్లు నేలకొరిగాయి. నెలరోజుల కిందటి వరకు ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికి పంట చేతికి వచ్చే సమయా నికి ధరలు కుప్పకూలాయి. ధర తగ్గినా పంటను ఆపలేము కనుక ఏదో ఒక రేటుకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-పెద్దవీరనారప్ప, గడ్డం నాగయ్యపల్లి, నార్పల మండలం

అప్పులు తీర్చవచ్చు అనుకునేలోపే...



నేను ఏడు ఎకరాల్లో అరటి సాగు చేశా. దిగుబడి బాగుంది. అప్పులు తీర్చేయవచ్చని అనుకొనేలోపే ధరలు పడిపోయాయి. టన్ను రూ.7వేలు మాత్రమే ఉండటంతో సాగు కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. ఇది ఇలాగే కొనసాగితే రైతులకు ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదు.

-గోవర్ధన్‌రాజు, కడవకల్లు, పుట్లూరు మండలం

టమోటా కిలో రూ.25

అనంతపురం రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.13, సరాసరి ధర రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 235టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి అనుమానాస్పద మృతి


రాజు (ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులచెరువు గ్రామంలో ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన రత్నమయ్య, లక్ష్మీదేవి దంపతుల పెద్ద కుమారుడు దేవరకొండ రాజు(31) కియలో ఉద్యోగం చేస్తుండేవాడు. అతడికి ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన తలారి చరణ్‌కుమార్‌తో స్నేహం ఏర్పడింది. ఈ నేపథ్యంలో చరణ్‌కుమార్ ఆదివారం సాయంత్రం రాజును తన బైక్‌లో ఎక్కించుకుని స్వగ్రామమైన మండలంలోని రావులచెరువుకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలోని ఓ హోటల్ వద్ద రాజు అర్ధరాత్రి గాయాలతో మృతిచెంది పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులు, రాజు కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. రాజు మృతిపై అనుమానాలున్నాయని అతడి తండ్రి రత్నమయ్య ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు. రాజుకు భార్య మన్విత, కుమార్తె ఉన్నారు. మన్విత ప్రస్తుతం 9 నెలల గర్భిణి. రాజు మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజును ఎవరైనా హత్య చేశారా, మరే కారణంతోనైనా మృతిచెందాడా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

బంధువుల ఆందోళన


మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ రెడ్డప్ప

దేవరకొండ రాజు మృతిపై అనుమానాలున్నాయని అతడి కుటుంబీకులు, బంధువులు.. ధర్మవరం ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన కుమారుడిని తలారి చరణ్‌కుమార్ బైకులో ఎక్కించుకెళ్లాడనీ, మృతిపై అనుమానాలు ఉన్నాయని రాజు తండ్రి రత్నమయ్య ఆరోపించారు. న్యాయం చేయాలని కోరారు. అక్కడి నుంచి పోస్టుమార్టం రూమ్ వద్దకు వచ్చి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జి సీఐ రెడ్డప్ప అక్కడికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామనీ, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి


మోహన్ (ఫైల్)

బొమ్మనహాళ్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భార్య మందలించిందని ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని శింగానహళ్లి గ్రామానికి చెందిన కురుబ మోహన్(41) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు గ్రామానికి చెందిన మోహన్ మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. కొద్ది రోజులు కిందట ఇంటి వద్ద ఉన్న బైక్‌ను కుదవపెట్టి, వచ్చిన డబ్బును మద్యం తాగడానికి ఖర్చు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన భార్య గీత మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మోహన్ ఆదివారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం

- ఎస్పీకి గుత్తి మహిళ ఫిర్యాదు
- పోలీస్ గ్రీవెన్స్‌కు 110 అర్జీలు
- పరిష్కరించాలని ఎస్పీ జగదీష్ ఆదేశం


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్


గుత్తి మహిళ రామాంజినమ్మ, ఆమె కుటుంబీకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిట్టీలు, పెట్టుబడుల పేరుతో రూ.90 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదని గుత్తి పట్టణానికి చెం దిన రామాంజినమ్మ ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. అన్నపూర్ణ, ఆమె భర్త రామకృష్ణ, ప్రైవేట్ బ్యాంకులో పనిచేసే అంజన్ కుమార్, ప్రవీణ్ తనను మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 110 అర్జీలు వచ్చాయి. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. మాదాలం ప్రభాకర్ అనే వ్యక్తి భూమి విషయంలో తనను మోసం చేశారని కస్తూరి ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నాగ ప్రహ్లాద ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాను దుబాయిలో ఉంటున్నానని, బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లిలో 2017లో ప్లాట్లు కొనుగోలు చేసి, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని తెలిపారు. 2022లో తాను ఇండియాకు తిరిగి వచ్చానని, ప్లాట్స్‌ను అమ్మేందుకు చూ స్తే సర్వే నంబర్లకు, స్థలానికి సంబంధం లేకుండా ఉందని అన్నారు. దీని గురించి అడిగితే మాదాలం ప్రభాకర్ తనకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఎస్పీకి వివరించారు. గ్రీవెన్స్‌లో మహిళా పోలీసు విభాగం డీఎస్పీ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి: కలెక్టర్

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు 540 అర్జీలు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధిలో అగ్రపథంలో నిలిపేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోలాలు అర్జీలు స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమానికి 540 అర్జీలు వచ్చాయి. అనంతరం రెవెన్యూ భవన్‌లో ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. మండల, డివిజన్ స్థాయి అధికారులు కూడా ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు, సర్వే శాఖలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని పూర్తి స్థాయిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఎస్‌డీసీలు ఆనంద్, మల్లికార్జున, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వానొచ్చినా ఆగదు

- 25న అమరావతిలో మెగా డీఎస్సీ సభ
- ఎంపికైన ప్రతిఒక్కరూ హాజరు కావాలి
- బస్సులు, భోజనం ఏర్పాట్లు పక్కాగా ఉండాలి
- విద్యాశాఖాధికారులకు కమిషనర్ ఆదేశం


ఏర్పాట్లపై ఆదేశాలు ఇస్తున్న విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

అనంతపురం విద్య, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ఈసారి వర్షం వచ్చినా మెగా డీఎస్సీ సభ ఆగదని, తప్పకుండా జరిపితీరుతామని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. ఈనెల 19న జరగాల్సిన సభను భారీ వర్షాల వల్ల ఇబ్బందులు వస్తాయేమోననే సందేహంతో చివరి నిమిషంలో వాయిదా వేసిన విషయం తెలిసిందే. వాయిదా పడిన ఆ సభను ఈనెల 25న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సభ ఏర్పాట్లపై కమిషనర్ సోమవారం విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీఎస్సీ-2025లో ఎంపికైన వారికి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో ఈనెల 25న నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఆమేరకు ఎంపికైన వారికి సమాచారం అందించి, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. డీఎస్సీలో ఎంపికైన ప్రతి ఒక్కరితో పాటు వారికి సంబంధించిన మరొకరు విధిగా హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అనంత జిల్లా నుంచి 24న ఉదయమే అమరావతికి బయలుదేరి రావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు అవసరమైన బస్సులు, భోజనం, టిఫిన్, పర్యవేక్షణ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతిబస్సుకు ఒక ఎంఈఓ లేదా హెచ్ఎం, ఒక పీడీ, ఒక పోలీస్‌ను పర్యవేక్షణకు నియమించాలని ఆదేశించారు. ఏ జిల్లాలో ఎంపికైన అభ్యర్థి ఆ జిల్లా నుంచి వచ్చే బస్సులలోనే రావాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ గర్భిణులు, బాలింతలు, ఏమైనా సర్జరీలు చేయించుకున్న అభ్యర్థులు సభకు రాలేకపోతే వారి సమాచారం ముందే తెలియజేయాలని, అలాంటి వారికి సభలో నియామకపత్రాలు పెండింగ్‌లో ఉంచి డీఈఓల ద్వారా అందించేలా చూస్తామన్నారు. అన్నిశాఖలు సమన్వయం చేసుకొని పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

రేపు ఉదయమే అనంతకు చేరుకోవాలి


వివరాలు వెల్లడిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

మెగా డీఎస్సీ సభకు అమరావతికి వెళ్లే విజేతలు అందరూ 24 న ఉదయమే అనంతపురం చేరుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఎంపికైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. వీరి కోసం 45ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి అభ్యర్థి ఉదయం 5గంటలకే ఆలమూరు రోడ్డు నందుగల పీవీకేకే కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. ఇదివరకే ఐడీ కార్డు తీసుకున్న అభ్యర్థులు వారి సహాయకులు వాటిని వెంట తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు.

పెద్దారెడ్డి విషయం ఏం చేశారు..?

- ఏఎస్పీ రోహిత్‌ను ప్రశ్నించిన జేసీ ప్రభాకర్ రెడ్డి
- స్పందించలేదని రోడ్డుపై పడుకుని నిరసన

తాడిపత్రి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నిరసనకు దిగారు. తాడిపత్రిలోని డీఎస్పీ కార్యాలయం వద్దకు సోమవారం వెళ్లిన ఆయన, ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిని ఈ విషయమై ప్రశ్నించారు. 'కోర్టు ఆదేశాల మేరకు పెద్దారెడ్డి ఐదు వాహనాల్లోనే తిరగాలి. అంతకంటే ఎక్కువ వాడుతున్నారు. సెక్యూరిటీ ఖర్చులను ఆయన ప్రభుత్వానికి చెల్లించలేదు. దీనిపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినా పట్టించుకోలేదు. మేము ఏ ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోరా..?' అని నిలదీశారు. కార్యాలయం లోపలికి వస్తే అని విషయాలు చెబుతానని ఏఎస్పీ అనగా, చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తేనే లోపలికి వస్తానని ప్రభాకర్ రెడ్డి అన్నారు. దీంతో ఏఎస్పీ లోపలికి వెళ్లిపోయారు. ఆయన తీరుకు నిరసనగా జేసీ ప్రభాకర్ రెడ్డి అక్కడే కుర్చీలో బైఠాయించారు. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో గుత్తి రోడ్డులోని అశోక్ పిల్లర్ వద్దకు వెళ్లి నిరసన కొనసాగించారు. మంచం తెప్పించుకుని అక్కడే పడుకున్నారు. పోలీసుల తీరుపై జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జూలైలో ఆర్టీఏ అధికారులపై ఫిర్యాదు చేశాం. సర్ సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాల మీద జెఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాం. ఇంటి వద్దకు వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులను రమేష్ రెడ్డి దూషించాడు. యూట్యూబ్ చానల్ నాగరాజుపై కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున ఫిర్యాదు చేశారు. కుమ్మరి నాగరాజు నుంచి వైసీపీ నాయకులు దౌర్జన్యంగా డబ్బులు వసూలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జావిద్‌పై షబ్బీర్ బాషా అలియాస్ గోరా ఫిర్యాదు చేశాడు. వైసీపీ నాయకులు 'చంద్రబాబు రీకాల్' ప్రోగ్రాం పెట్టారు. అప్పట్లో మేము రోడ్డు మీదకు వచ్చామని కేసులు బనాయించారు. పెద్దారెడ్డి కోడలు హర్షితా రెడ్డి, రమేష్ రెడ్డిపై ఎందుకు కేసులు నమోదు చేయలేదు..? మా అనుచరుడు పరమేష్, లింగమయ్య, నారాయణరెడ్డిని జిల్లా పోలీసులు తీసుకుపోయి చితకబాదారు..' అని విమర్శించారు. రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి, పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐలు ధరణీబాబు, కాటమయ్య, రమణయ్య వెళ్లి ఆయనతో చర్చించినా నిరసన కొనసాగించారు. చివరకు సాయంత్రం 4:30 గంటల సమయంలో ఎస్పీ జగదీశ్‌తో మాట్లాడిన సీఐలు, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన నిరసన విరమించారు.



మంచంపై పడుకుని నిరసన తెలుపుతున్న జేసీపీఆర్

ఇరికించబోయి.. ఇరుక్కున్నారు

- గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మనస్పర్థలతో ఓ వ్యక్తిని గంజాయి కేసులో ఇరికించబోయి తామే ఇరుక్కున్న సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. కేసు వివరాలను అర్బన్ సీఐ జయనాయక్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణానికి చెందిన ముత్రాసి హరికృష్ణకు, చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన గోళ్ల అఖిల్‌కు గతం నుంచి మనస్పర్థలున్నాయి. దీంతో అఖిల్‌ను ఏదో ఒక కేసులో ఇరికించాలని హరికృష్ణ భావించాడు. ఈక్రమంలోనే తన మామ ముత్రాసి అనిల్ సాయంతో శెట్టూరు మండలం చెలిమేపల్లిలో ముత్రాసి శంకర్ వద్ద అరకిలో గంజాయిని కొనుగోలు చేశాడు. వాటితో పాటు శ్రీగంధం చెక్కలను సేకరించారు. వీటిని తీసుకెళ్లి అఖిల్‌కు సంబంధించిన స్థలంలో ఉంచాలని భావించారు. అయితే వీరి వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వారి ఇంటవద్దకు వెళ్లి తనిఖీ చేశారు. ఈక్రమంలోనే నిందితులైన ముత్రాసి హరికృష్ణ, ముత్రాసి అనిల్ మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 370 గ్రాముల గంజాయి, 214 గ్రాములు గంజాయి మొక్కలు, 10 కిలోల శ్రీగంధం చెక్కలు, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక ద్విచక్రవాహనం, ఒక కొడవలిను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, రాయదుర్గం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. కాగా గంజాయిని సాగుచేస్తున్న ముత్రాసి శంకర్ ఆచూకీ తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.


నిందితులను చూపిస్తున్న పోలీసులు

ప్రతి ఇంటికీ పండగ

(5వ పేజీ తరువాయి)

వారితో టేబుళ్లు నిండిపోయాయి. కొన్ని షోరూంలలో అంత జోష్ కనిపించలేదు. నగరంలోని బైక్‌ల షోరూంలలో కొన్నింటిలో సోమవారం ఒక్కరోజే ఆరు నుంచి 10 బైక్‌లు బుక్ చేసుకునానరు. షోరూంలలో సగటున 5 వరకు డెలివరీ తీసుకున్నారు. కార్ల షోరూంలలో 5 నుంచి 10వరకు బుక్ చేసుకున్నారు. రెండు నుంచి నాలుగు కార్లు డెలివరీ అయ్యాయి. కమర్షియల్ (బొలెరో పికప్) ఓ షోరూమ్‌లో 5 వాహనాలు డెలివరీ అయ్యాయి.

గృహ నిర్మాణం

గృహ నిర్మాణానికి సంబంధించి సిమెంటుపై 28 నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించారు. రూ.340 ఉన్న సిమెంటు ధర రూ.40 దాకా తగ్గింది. పెట్రోల్, డీజిల్, సీఎన్జీ వాహనాల వాటి విడిభాగాలపై జీఎస్టీ తగ్గించినా పాత రేట్లతోనే అమ్మకాలు చేపట్టారు. జీఎస్టీ సంస్కరణలతో అన్ని వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి.

దుస్తులు, చెప్పులు, బూట్ల విషయంలో...

రూ.1000లోపు ధర ఉన్న దుస్తులు, చెప్పులు, బూట్లపై 5శాతం, ఆపై ధర ఉంటే 12 శాతం పన్ను వసూలు చేసేవారు. ఇక నుంచి రూ.2500 వరకు ఉన్న వస్త్రాలు, పాదరక్షలపై 5 శాతమే పన్ను వర్తిస్తుంది. రూ.1000 నుంచి రూ.2500 వరకు ధర ఉన్న వాటి ధరలు తగ్గాయి. రూ.2500కిపైగా ధర ఉండే వస్త్రాలు, పాదరక్షలు 12 నుంచి 18 శాతానికి పెంచారు. వీటి విషయంలో దుకాణదారులు గోల్‌మాల్ చేసే అవకాశం లేకపోలేదు.

మోదీకి థ్యాంక్స్: వెంకటేష్, గుంతకల్లు



కార్లపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించడం ఆనందాన్నిచ్చింది. మహీంద్రా కంపెనీకి చెందిన థార్ రాక్స్ కారు కొనుగోలు చేశా. ఆన్‌రోడ్ ధర ఇదివరకు రూ.27.20 లక్షలు ఉండేది. ఇప్పుడు రూ.25.90 లక్షలకు కొనుగోలు చేశా. రూ.1.30లక్షల వరకు తేడా కనిపించింది. ఇది సంతృప్తినిచ్చింది. ప్రధాని మోదీకి థ్యాంక్స్.


కొడుకు పెళ్లికి కొత్త బైక్



ఇదివరకే పాత బైక్ ఉన్నా.. త్వరలో జరగనున్న కొడుకు పెళ్లి కోసమని యూనికార్న్ బైక్ కొన్నా. రూ.1.56 లక్షలున్న బైక్ జీఎస్టీ తగ్గాక రూ.1.47 లక్షలకు వచ్చింది. ఇతర ప్రాంతాల్లో ఇదే బైక్ ధరల్లో తేడా ఉంటోంది. ఆ తేడా లేకుండా అన్ని షోరూంలలో ఒకే ధరకు విక్రయించాలి.

- వెంకటరమణ, చెన్నంపల్లి, బీకేఎస్ మండలం

20 రోజులకే రూ.9వేలు తేడా: ఎల్లేశ్వర్, అనంతపురం



వాహనాలపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించడం చాలా మార్పు తీసుకురానుంది. ఒకేసారి రూ.వేలల్లో తగ్గితే ఎవరైనా కొనుగోలుకు ముందుకు వస్తారు. నా ఫ్రెండ్ 20రోజుల క్రితం రూ.1.56 లక్షలకు యూనికార్న్ బైక్ కొన్నాడు. ఇప్పుడు అదే బైక్‌పై రూ.9వేలు తగ్గింది.

సెకెండ్ హ్యాండ్ కొందామనుకున్నా..



ఉద్యోగ రీత్యా రోజూ దూర ప్రయాణం చేస్తుంటాను. వాహన ధరలు అధికంగా ఉండటంతో సెకెండ్ హ్యాండ్ బైక్ కొనుగోలు చేయాలని అనుకున్నాను. నా బడ్జెట్‌లో దొరికే బండికోసం చూస్తున్నాను. ఇంతలోగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో కొత్త బైక్ కొనాలని ఈ రోజు వరకూ ఆగాను. హీరో స్ప్లెండర్‌పై దాదాపు రూ.10 వేలు తగ్గింది. అందుకే కొంటున్నాను. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మాలాంటి మధ్యతరగతి వారికి ఊరట.

- అనిల్, కొనుగోలుదారు, గుత్తి

జీఎస్టీ తగ్గింపుతో లాభమే..



జీఎస్టీ తగ్గింపు మధ్యతరగతి వర్గాలకు లాభం చేకూర్చేదే. పల్సర్ 150 బైక్ బుక్ చేశా. రూ.1.44లక్షలున్న బైక్ ధర జీఎస్టీ తగ్గాక రూ.1.34 లక్షలకు వస్తోంది. రూ.10వేలు తేడా ఉండటం మంచిదే కదా.

-సాయి, రుద్రంపేట



మత్స్యావతారంలో ఖాద్రీశుడు

కదిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల కోసం కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీవారు సోమవారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

గెలుపోటములు సమంగా తీసుకోండి

- సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు


రన్నరప్‌గా నిలిచిన అనంతపురం జిల్లా బాలికల జట్టు

ఉరవకొండ, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములు రెండింటినీ సమానంగా తీసుకోవాలని సెపక్‌తక్రా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సెంట్రల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 28వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికలు, బాలుర పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో బాలురు, బాలిక విభాగం రెండింటిలోనూ కృష్ణా, అనంతపురం జిల్లా జట్లు తలపడ్డాయి. బాలురు, బాలికల విభాగంలో విన్నర్‌గా నిలిచిన కృష్ణా జిల్లా జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకుంది. రన్నర్‌గా అనంతపురం జిల్లా జట్లు నిలిచాయి. గెలుపొందిన జట్లకు షీల్డ్, మెమెంటోతో పాటు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా జిల్లా చైర్మన్, కార్యదర్శి మల్లికార్జున, షాహిన్, ఎస్కేఆర్సీ క్లబ్ ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి, నాగరాజు, ప్రభాకర్, రాఘవేంద్ర, మంజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైలు తిరుపతి వరకు పొడిగింపు

గుంతకల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చర్లపల్లి-రక్సల్-చర్లపల్లి మధ్య నడుస్తున్న ప్రత్యేక వీక్లీ రైలును తిరుపతి వరకు (వయా గుంతకల్లు) పొడిగించినట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. తిరుపతి-రక్సల్ ప్రత్యేక వీక్లీ రైలు (07051) ఈనెల 27 నుంచి నవంబరు 29వ తేదీ వరకూ తిరుపతిలో ఉదయం 8.36 గంటలకు బయలుదేరి సోమవారాల్లో మధ్యాహ్నం ఒకటిన్నరకు రక్సల్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07052) రక్సల్‌లో మంగళవారాల్లో ఉదయం ఎనిమిదిన్నరకు రక్సల్‌లో బయలుదేరి గురువారం సాయంత్రం ఆరున్నరకు తిరుపతికి చేరుతుందన్నారు. ఈ రైలు సితమరి, దర్భంగా, సమస్తిపూర్, బరౌనీ, కియుల్, జారూ, జసిడి, మధుపూర్, చిత్తరంజన్, బరాకర్, ధన్‌బాద్, చంద్రపుర, బకరో స్టీల్ సిటీ, యురి, హతియా, రూర్కెలా, ఝర్సుగుడా, బిలాస్‌పూర్, రాయపూర్, దుర్గ్, గోండియా, వాడ్సా, చంద్రా ఫోర్ట్, బలార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, ఖాజీపేట్, చర్లపల్లి, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, క్రిష్ణా, రాయచూరు, మంచిర్యాల రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంటుందని వివరించారు.

బెంగళూరు-బీదర్ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ కారణంగా బెంగళూరు-బీదర్(వయా గుంతకల్లు) మధ్య అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. బెంగళూరు-బీదర్ (06291) ప్రత్యేక రైలు ఈ నెల 30న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06292) డిసెంబరు 1న నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాద్‌నగర్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా బీదర్‌కు వెళ్తుందన్నారు.

నలుగురు రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పనిచేస్తున్న నలుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులు లభించాయి. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ సోమవారం జోన్ పరిధిలోని రైల్వే డివిజన్ల డీఆర్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో శ్రద్ధను, ప్రత్యేక నైపుణ్యాన్ని, భద్రతా ప్రమాణాలను, అప్రమత్తతను ప్రదర్శించిన లోకోపైలెట్లు, సహాయ లోకో పైలెట్లు, స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్, కీమెన్‌లకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లో ముగ్గురికి, హైదరాబాద్ డివిజన్‌లో ఇద్దరికి, గుంతకల్లు రైల్వే డివిజన్‌ల నలుగురికి, విజయవాడ రైల్వే డివిజన్‌లో ఇద్దరికి, నాందేడ్, గుంటూరు రైల్వే డివిజన్లలో ఒక్కొక్కరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులు దక్కాయి. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో అవార్డులను పొందిన నలుగురు ఉద్యోగులను పిలిపించి అవార్డులను పంపిణీ చేయనున్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

కదిరిఅర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీడీగా బోయపాటి శకుంతల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపప్పూరు మండలం ఎంపీడీఓగా పని చేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై కదిరి ఏపీడీగా వచ్చారు. ఆమెకు ఎంపీడీఓ పోలప్ప, సిబ్బంది, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

● గాండ్లపెంట: మండలకేంద్రంలో పనిచేస్తున్న ఈఓఆర్డీ సునీత సోమవారం ఎంపీడీఓగా (ఎఫ్ఎసీ) అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈఓఆర్డీ సునీతకు ఉన్నతాధికారులు ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు.

మృతిచెందిన సీఆర్పీ కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీఆర్పీగా ఉన్న బాబావలి జూలై నెలలో మండల పరిధిలోని కొత్తదేవరపల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబానికి అండగా నిలిచిన డీఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓ జయచంద్ర, ఉపాధ్యాయులు చంద్ర రూ.1.10లక్ష చెక్కును అందజేశారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో బాబావలి భార్య పి. అమీరమ్మకు చెక్కు అందజేశారు.

నేడు అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ

● ఎంపీడీఓ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్‌పై శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. సభ్యులందరూ ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ వెంట తీసుకురావాలని ఎంపీడీఓ తెలిపారు.


ధర్మవరంలో దుర్గాదేవిగా దుర్గమ్మ


బాలా త్రిపురసుందరిగా సాలేవీధి పెద్దమ్మ


కదిరిలో మహాలక్ష్మిగా మల్లాలమ్మ


రాజరాజేశ్వరిగా చౌడేశ్వరి

బాలా త్రిపురసుందరీ నమో నమః

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ధర్మవరం, కదిరి పట్టణాలలోని ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అలాగే బత్తలపల్లి, అమడగూరు తదితర మండలకేంద్రాల్లోనూ శరన్నరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి.


బత్తలపల్లిలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు


అమడగూరులో చౌడేశ్వరి

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ, ఎంపీ బీకే





పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ. శ్యామ్‌ప్రసాద్‌ను ఎస్పీ సతీష్‌కుమార్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి సోమవారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో పోలీసుల పనితీరు, శాంతి భద్రతల గురించి ఎస్పీ కలెక్టర్‌కు వివరించగా, అభివృద్ధి సంక్షేమం గురించి ఎంపీ చర్చించారు.

కలెక్టర్‌కు ఎన్జీఓలు, వీఆర్ఏల వినతి

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీఓల జిల్లా అధ్యక్షుడు లింగా రామమోహన్ ఆధ్వర్యంలో పలువురు ఎన్జీఓలు సోమవారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను కలిశారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రామప్ప, రవీంద్రరెడ్డి, శంకర్‌రావు, గఫూర్, దేవేంద్ర, బాబా, మురళీ, మానస, పరిమలా, పుష్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే దశాబ్దాలుగా పనిచేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, పలువురు వీఆర్ఏలు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన పంచాయతీ కార్మికులు

ఆంధ్రజ్యోతి స్పందన

కొత్తచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను పంచాయతీ కార్మికులు తొలగించారు. 'అపరిశుభ్రంగా పరిసరాలు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు కార్మికులను పంపి నెహ్రూనగర్‌లో రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై ఎక్కడిపడితే అక్కడ వేయరాదని, చెత్త ట్రాక్టర్‌లోనే వేయాలని ఎంపీడీఓ నటరాజ్ పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణకు ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం


ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ విగ్రహావిష్కరణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆహ్వానించారు. సోమవారం అమరావతిలోని అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి పేషీలో మర్యాదపూర్వకంగా కలిసి, ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఎమ్మెల్యేతో పాటు బలిజ, కాపుసంఘం నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న


నీటి మునిగిన మొక్కజొన్న పంట

తనకల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు వంకలు, వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. బొంతలపల్లికి చెందిన రామిరెడ్డి మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు. పంట సాగు చేయడానికి రూ.50వేలుకు పైగా ఖర్చు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో భారీగా కురిసిన వర్షాలకు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన రంగప్ప, రమేష్ సాగుచేసిన రెండు ఎకరాల మొక్కజొన్న పంట పైనున్న కాలువలు పొంగడంతో పూర్తిగా నేలమట్టమైంది. రూ.5లక్షలు నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన చెందారు. పంట చేతికొస్తుందన్న తరుణంలో వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినిందని బాధపడ్డారు. ప్రభుత్వం పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ఆదుకోవాలని కోరారు.

అట్టహాసంగా శ్రీరామ్ జన్మదిన వేడుకలు


ముదిగుబ్బలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● ముదిగుబ్బ: పరిటాల శ్రీరామ్ జన్మదినాన్ని ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో, రైల్వే స్టేషన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌లను కట్‌చేశారు. కార్యకర్తలకు, ప్రజలకు స్వీట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, అశ్వత్థరెడ్డి, తుమ్మల మనోహర్, నాగిరెడ్డి, నరసింహ యాదవ్, కోట్ల బాబి, వినోద్ బాబు, గోపాల్ రెడ్డి, ఆనంద్, జయప్రకాష్, శేఖర్, నాయుడు, సుధాకర్, త్రిలోక్, నారాయణస్వామి, సునీల్, తుమ్మల సూరి, చంద్ర సేన, అమర, వెంకట కృష్ణ, బీజేపీ నాయకులు సోమల ప్రకాష్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

● బత్తలపల్లి : పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను సోమవారం మండలకేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను మండల కన్వీనర్ నారాయణరెడ్డి కట్ చేశారు. ర్యాలీగా వెళ్లి ఆర్డీటీ ఆసుపత్రి వద్ద అన్నదానం చేపట్టారు. నాలుగురోడ్ల కూడలిలో తెలుగు యువత నాయకులు అప్పస్వామి, అశోక్ కేక్‌కట్ చేసి రూ.50వేలు విలువ చేసే బాణాసంచా కాల్చారు. టీడీపీ నాయకుడు జక్కంపూటి సత్యనారాయణ నాలుగురోడ్ల కూడలిలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసులు, మాదినేని కేశవ, బాసిగొండ రవి, రమణ, చౌదరి, బాలాంజనేయులు, నాగభూషణ, ఆద్రా మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


తాడిమర్రిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● తాడిమర్రి: పరిటాలశ్రీరామ్ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేశారు. అనంతరం కునుకుంట్ల గ్రామంలో అన్నదానం చేశారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నాయకులు సాయి, రాజశేఖర్, రంగయ్య, పక్కీర్‌రెడ్డి, ఆత్మకూరు శ్రీనివాసులు, అశ్వత్థ, వీరరాఘవ, బద్రి పాల్గొన్నారు.


ధర్మవరం అన్నక్యాంటిన్‌లో అన్నదానం చేస్తున్న మండల నాయకులు


ఎర్రగుంట టీడీపీ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేస్తున్న నాయకులు


సంధా రాఘవకు కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు సోమవారం పట్టణంలో వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గాంధీనగర్ శివాలయంలో పరిటాల శ్రీరామ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం టీడీపీ గాంధీనగర్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అక్కడే ము స్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్న క్యాంటీన్‌లలో అ న్నదానంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. షిర్డీసాయిబాబా ఆలయంలో అన్నదానం చేపట్టారు. అనంతరం టీడీపీ ఎర్రగుంట కార్యాలయంలో ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు సంధారాఘవ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. 25వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో బ్రహ్మంగారు, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి, అక్కడే కేక్‌కట్ చేశారు. ప్రాథమిక పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలు నాటారు. యాదవ వీధిలో 23వ వార్డు ఇన్‌చార్జ్ అద్ర మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చీరలను పంపిణీ చేశారు. 26వ వార్డులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్ చౌదరి, ఫణికుమార్, పరిశే సుధాకర్, సంధా రాఘవ, నాగూర్ హుస్సేన్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, చింతపులుసు పెద్దన్న, మాధవరెడ్డి, జింకా పురు షోత్తం, కొత్తపేట ఆది, రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, గుడిపాటి చంద్ర, శీలామూర్తి, చట్టా లక్ష్మీనారాయణ, బొట్టు కిష్ట, జింకల రాజన్న, అస్లాం, మాదన సుబ్బయ్య, గుడిపాటి కిశోర్, భాస్కర్‌చౌదరి, కేశగాళ్ల శీన, పల్లెం క్రిష్ణ, కరెంటు ఆది, అద్ర మహేశ్, టైలర్ గోపాల్, రావులచెరువు కుళ్లాయప్ప, మార్కెట్ రహీం, జిలకర శీన, పూజా మొబైల్ సాయి, అంగజాల చిన్నవీరప్ప, లింగప్ప, గవ్వల నారాయణస్వామి, చీమల రామాంజి, గడ్డం సూరి, రాంపురం శీన, గంగారపు రవి, చీమల నాగరాజు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


లక్ష్మీచెన్నకేశవపురం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం


యాదవవీధిలో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న నాయకులు


ఏలుకుంట్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


చిగిచెర్లలో..

● ధర్మవరం రూరల్: పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను సోమవారం గ్రామగ్రామానా పండుగలా నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో పరిటాలశ్రీరామ్ పేరుతో పూజలు చేసి కేక్‌లు కట్ చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం చేపట్టారు. ధర్మవరం పట్టణంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నక్యాంటీన్ వద్ద అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు మహేష్ చౌదరి, పోతుకుంట లక్ష్మన్న, విజయసారథి, మేకల రామాంజినేయులు, తలారి వెంకటలక్ష్మి, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, ఏలుకుంట్ల ఏగినాటిరమణ, పోతుకుంట రవి, భాస్కర్‌చౌదరి, విజయ్‌చౌదరి, అమర సుధాకర్, వెంకటరెడ్డి, గొట్లూరు అమరేంద్ర, నేలకోట రామ్మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, ముచ్చు రామిక్రిష్ణ, నిమ్మలకుంట దళవాయి కుళ్లాయప్ప, చెలిమిఅంజి, గడ్డం రాయుడు, గవ్వల రామాంజినేయులు, ఐటీడీపీ రాము, బిల్వంపల్లి రవి, మల్లేనిపల్లి చంద్ర, బిల్వంపల్లి ఓబిలేసు, బాబు, బడన్నపల్లి రామాంజి, గరుడంపల్లి చంద్రశేఖర్, తలారివంటరమేష్, వెంకటేష్, బండినారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏలుకుంట్లలో... టీడీపీ నాయకులు మోపూరి రామ్మోహన్, గుతా సూరి, జయచంద్ర, పురుషోత్తం, రమేష్‌నాయుడు, మలసానిభాస్కర్, జయప్రకాష్‌రెడ్డి తదితరులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే పోతులనాగేపల్లిపంచాయతీలో టీడీపీ నాయకులు ఆదెప్ప, కత్తే ప్రసాద్, బన్యాల కాటమయ్య, నరసింహులు, తదితరులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో టీడీపీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు పార్థారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు పెద్దిరెడ్డిగారి శేఖర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, చంద్రాయుడు, అశోక్, నరసింహమూర్తి, హేమంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దర్శినమలలో... మండలంలోని దర్శినమల గ్రామంలో పరిటాల శ్రీ రామ్ జన్మదిన వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ నాయకులు జంగం నరసింహులు గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.


దర్శినమలలో కేక్ కట్ చేస్తున్న జంగం నరసింహులు

25న పిన్నదరిలో ఉచిత వైద్యశిబిరం

తాడిమర్రి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని పిన్నదరి సచివాలయంలో ఈ నెల 25న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్న ట్లు సేవాసమితి ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, వైట్ ఫీల్డ్ వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో పలు వ్యాధులకు వైద్యసేవలు అందిస్తార న్నారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయూష్మాన్ భారత్- పీఎంజేఏవై పథకాల ద్వారా పూర్తి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 7998256789. 9535197749 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

కొత్తచెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్మపాళ్యంకు చెందిన అప్పకొండప్పగారి నాగేంద్ర(55) అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా గుడిబండ మండలంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే ఇంట్లో సోమవారం ఉన్నఫలంగా ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు స్థానిక సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్టు నిర్ధారించారు. ఆయనకు భార్య శాంతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మధ్య తరగతికి మేలు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్


పుట్టపర్తిలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం ద్వారా జీఎస్టీ తగ్గి మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూర్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్ తెలిపారు. పుట్టపర్తిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆ పార్టీ నాయకులు కొండమ రాజు, లాయర్ హరికృష్ణ, సురేశ్, కల్యాణ్, బాలగంగాధర్, సునీల్‌వైట్ల పాల్గొన్నారు.

ధర్మవరం/ ఓబుళదేవరచెరువు/ అమడగూరు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని కాలేజ్ సర్కిల్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన జీఎస్టీ సంస్కరణలకు మద్దతుగా ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే ఓబుళదేవరచెరువులోని అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజి ఆధ్వర్యంలో పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమడగూరు లోని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

శ్రమదానం

బుక్కపట్నం(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం బుక్కపట్నంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో చీపుర్లు పట్టి పిచ్చి మొక్కలను, ముళ్లకంపలను తొలగించారు. అనంతరం నాయకులు మాట్లాడుతు ప్రధాని ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిక్రిష్ణగౌడ్, సేవా పక్వాడ్ జిల్లా కన్వీనర్ రమేష్‌బాబు, మండలాధ్యక్షులు మహమ్మద్‌రఫీ, బీజేపీ సీనియర్ నాయకులు కొండమరాజు, బాలగంగాధర్, విష్ణు, రాజేష్, సురేంద్ర, టీడీపీ టౌన్ కన్వీనర్ ఎర్రకేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నల్లచెరువు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సీతారామాలయం జీర్ణోద్ధరణకు మండలకేంద్రానికి చెందిన ఎస్‌పీ మౌలాలీ, తాటిచెర్ల ముస్తఫా రూ. 1. 54లక్షలను ఆలయ కమిటీ వారికి సోమవారం విరాళంగా అందించారు. ఆలయాభివృద్ధికి సహకరించిన వారిని దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు దశరథనాయుడు, మురళి, కేసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత

తాడిమర్రి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి సేకరించి అనంతపురానికి తరలిస్తున్న వాహనాన్ని చిల్లవారిపల్లి వద్ద విజిలెన్స్ సీఐ మహబూబ్‌భాషా ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని దాడి తోట, సింహాద్రిపురం సమీప గ్రామాల్లో సేకరించినట్లు విజిలెన్స్ సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని, వాహనాన్ని సీఎస్‌డీటీ శారదకు అప్పగించారు. బియ్యాన్ని తరలిస్తున్న సింహాద్రిపురం మండలానికి చెందిన శివకోటిరెడ్డి, జశ్వంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

అమ్మపేరుతో ఒక మొక్క: సీడీపీఓ

తనకల్లు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): అమ్మపేరుతో ఒక్క మొక్కను నాటి సంరక్షించాలని నల్లచెరువు సీడీపీఓ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం పోషణా మాసోత్సవాలను అధికారులు నిర్వహించారు. సీడీపీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామూహిక సీమంతం నిర్వహించారు.

న్యూస్ బాక్స్

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



గోరంట్లలో క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో గోరంట్లలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో క్షీరాభిషేకంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బాలక్రిష్ణచౌదరి, లక్ష్మీనారాయణ, సంతోష్, సోముశేఖర్, నిమ్మల విద్యాధరణి, గంగాధర్, నబీరసూల్, చలం, హరీష్, నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రణభేరిని విజయవంతం చేయండి : యూటీఎఫ్



పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మడకశిర టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈనెల 25న గుంటూరులో జరుగు బహిరంగా సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూతన్న పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో రణభేరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీ వర్తింపచేయాలని, కమిటీ నియామకం ఆలస్యమయితే 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని రణభేరి సభను నిర్వహిస్తున్నాముని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాలింగప్ప, జోగప్ప, జీఎల్ కదిరన్న, రవీంద్ర, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



కమలాబాయి

గోరంట్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా కమలాబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్ డోన్‌కు బదిలీపై వెళ్లారు. పెనుకొండ డిప్యూటీ ఎంపీడీఓ కమలాబాయి ప్రమోషన్‌పై గోరంట్ల ఎంపీడీఓగా వచ్చారు.

ఆర్థిక కార్యకలాపాలు పక్కాగా నిర్వహించాలి

చిలమత్తూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళల పొదుపు సంఘాలను బలోపేతం చేస్తూ వాటి ఆర్థిక కార్యకలాపాలన్నీ పక్కాగా నిర్వహించడం కోసం మన డబ్బులు-మన లెక్కల పేరుతో కొత్త కార్యక్రమం తీసుకువస్తున్నట్లు మండల వెలుగు కార్యాలయ ఏపీఎం నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి వెలుగు సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం నారాయణ మాట్లాడుతూ.. గతంలో మహిళల పొదుపు సొమ్ము, రుణాలకు సంబంధించిన డబ్బులు పక్కదారి పట్టేవన్నారు. సంఘాలకు సంబంధించి లావాదేవాలు సరిగా ఉండేవి కావన్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని కొందరు సంఘంలో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికి ప్రభుత్వం మన డబ్బులు- మన లెక్కలు పేరుతో కొత్త యాప్‌ని తీసుకు వచ్చిందన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

చిలమత్తూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో ఆయన పీఏ వీరయ్య ఆధ్వర్యంలో అధికారులతో కలిసి ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకోవాలన్నారు.

బీఎల్ఓలతో తహసీల్దార్ సమీక్ష

రొద్దం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా ఉన్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు బీఎల్ఓలకు సూచించారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో మండలంలోని బీఎల్ఓలతో తహసీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలోని చనిపోయినవారిని తొలగించడం, కొత్తవారిని చేర్చే పనులు వేగవంతం చేయాలన్నారు. ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్ఓలు వైకుంఠప్ప, శ్రీదేవి, తనూష, నూరి, గోపాల్, మనోహర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

నేతన్న పథకం అమలు చేయండి

హిందూపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా పథకాన్ని అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా చేనేత సంఘం నాయకులు దేవరాజు, బాబు, ఆనంద్, గోవిందప్ప, తదితరులు కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి సమస్యను తెలుపుకున్నామన్నారు. వెంటనే చేనేత కార్మికులకు నేతన్న భరోసా సంవత్సరానికి రూ.25వేలు అందించేవిధంగా పథకాన్ని ప్రారంభించాలన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యం: చైర్మన్

మడకశిర టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, అందుకు పూర్తిగా ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందని నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. సోమవారం మెప్మా ఆధ్వర్యంలో ప్లాస్టిక్ పడేసే ప్రాంతాల్లో రంగోలి కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ప్లాస్టిక్ వేసే 9 చోట్ల రంగోలి వేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. 9 చోట్ల వేసిన రంగోలిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ జగన్నాథ్, వైస్‌చైర్‌పర్సన్లు వెంకటలక్ష్మమ్మ, ప్రభావతి, మెప్మా సీఈఓలు పాల్గొన్నారు.



ముగ్గును పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్ తదితరులు

ఆలయాలకు శరన్నవరాత్రి శోభ

● వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
● ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మత్స్య అలంకరణలో పేట వెంకటరమణస్వామి



బాలాత్రిపురసుందరి దేవిగా చౌడేశ్వరి



విష్ణు దుర్గాదేవిగా కొల్హాపురి మహాలక్ష్మి



గోరంట్లలో బాలాత్రిపుర సుందరిగా చౌడేశ్వరీదేవి



పెనుకొండలో రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి

హిందూపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులను పురస్కరించుకుని మొదటిరోజు సోమవారం అమ్మవారి ఆలయాల్లో దేవతామూర్తులు ప్రత్యేక అంకరణలో దర్శనమిచ్చారు. ముద్దిరెడ్డిపల్లిలో చౌడేశ్వరిమాత బాలత్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. పేట వెంకటరమణస్వామి ఆలయంలో మత్స్య అలంకరణలో, కొల్హాపురి మహాలక్ష్మీ ఆలయంలో శ్రీవిష్ణు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మొదటి రోజు కావడంతో ఆలయాల్లో భక్తులు సాయంత్రం నుంచే క్యూకట్టారు. పట్టణంలో ఎనిమిదిచోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

● గోరంట్ల: శరన్నరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, చౌడేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

● పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. అర్చకులు దేవేంద్రస్వామి పూజు నిర్వహించారు.

● పెనుకొండ: పట్టణంలోని వెంకటరమణస్వామి, కన్యకాపరమేశ్వరి స్వామి, ఉజ్జయిని, మాంకాలమ్మ, పులేకమ్మ, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారిని ప్రత్యేక రూపాల్లో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరి రూపంలో అలంకరించారు.



పెనుకొండ వద్ద బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

● సోమందేపల్లి: మండలంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వేదంగాయత్రిగా దర్శనమివ్వగా, భవానీ అమ్మవారు అంబాభవానీగా దర్శనమిచ్చారు.

సెడ్స్ మాజీ ఉద్యోగుల సమస్యను పరిష్కరించండి



మంత్రితో మాట్లాడుతున్న సెడ్స్ మాజీ ఉద్యోగులు

పెనుకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలం మేకలపల్లిలోని సోషల్ డెడికేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ (సెడ్స్) మాజీ ఉద్యోగులను సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు వినతి పత్రం అందించారు. సోమవారం తాడేపల్లిలోని మంత్రి కార్యాలయంలో కలిసి మాజీ ఉద్యోగులు వినతి పత్రం అందించారు. సెడ్స్ స్వచ్ఛంద సంస్థ గత 30 ఏళ్లుగా పనిచేస్తోందన్నారు. అందులో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం స్టాఫ్‌వెల్ఫేర్ ఫండ్ బ్యాంక్ ఖాతా తెరిచి ప్రతినెలా జమ చేశారని, సంస్థ అధ్యక్షుడు రాజన్‌జోషువా స్టాఫ్ వెల్ఫేర్ ఫండ్ బ్యాంక్ ఖాతా నుంచి విత్‌డ్రాచేసుకుని తన పేరుమీద తొమ్మిది ఇంటిస్థలాలను రిజిష్టర్ చేయించుకున్నాడని అన్నారు. తరువాత తమకు రిజిష్టర్ చేయిస్తానని చెప్పాడని, దాటవేస్తూ కాలయాపన చేశాడన్నారు. రాజన్ జోషువ చనిపోవడంతో సంస్థ సీఈఓ మనీష్ జోషువ ఆ ఇంటిస్థలాలు అమ్మకానికి పెట్టాడని, లాయర్ నోటీసులు పంపించి మోసం చేశాడన్నారు. మంత్రి చొరవ తీసుకుని తమకు ఇంటిపట్టాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సంస్థ మాజీ ఉద్యోగులు సాయిప్రసాద్, వెంకటస్వామి, రమణమ్మ, సునీత, వెంకటేశ్, నాగరాజు పేర్కొన్నారు.

సోలార్ మాయలో పడకండి



కరపత్రాలు చూపుతున్న రైతు సంఘం నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు సోలార్ కంపెనీల మాయలో పడొద్దని రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో 'సోలార్ కంపెనీ మాయలో పడకండి, భూములపై హక్కులు కోల్పోకండి' అని ముద్రించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలోని కదిరి, మడకశిర, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాల్లో సోలార్ కంపెనీ ప్రతినిధులు రైతుల నుంచి వేలాది ఎకరాల భూమిని మాయమాటలు చెప్పి ఏజెన్సీల ద్వారా సేకరించే పనిలో ఉన్నారన్నారు. రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.30వేలు కౌలు ఇచ్చి భూములు తీసుకుంటున్నారన్నారు. సంవత్సరానికి 20శాతం కౌలు పెంచాలని, అగ్రిమెంట్ కాలపరిమితి 10సంవత్సరాలు మించరాదని, భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లుకాకుండా జిరాక్స్ కాపీలనే తీసుకోవాలని ఎకరాకు రూ.50వేలు తగ్గకుండా కౌలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఅంశాలపై ఈనెల 24న విజయవాడలో జరుగు మహాధర్నాలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా బేవి మాలమ్మ ఉత్సవాలు

అగళి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లికెర గ్రామంలో బేవి మాలమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారికి గ్రామస్థులు హారతులు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. తొమ్మిది రోజులపాటు ఈ పూజా కార్యక్రమాలు ఉంటాయని గ్రామస్థులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన భర్తను చూసి రోధిస్తున్న భార్య

అగళి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు చెందిన కారు ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన ఇస్మాయిల్‌ను ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. ఎస్.రాయపురం గ్రామానికి చెందిన ఇస్మాయిల్ కుటుంబ సభ్యులతో ద్విచక్రవాహనంలో వెళ్తూ మూత్రవిసర్జన కోసం ఆపాడు. అదే సమయంలో చిత్రదుర్గం జిల్లాకు చెందిన డ్రైవర్ మంజునాథ్ కారులో వేగంగా వస్తూ అగళి మండలం ఇరిగేపల్లి మండేమారెమ్మ గుడి సమీపంలో ఇస్మాయిల్‌ను ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇస్మాయిల్‌ను స్థానికులు హుటాహుటిన శిర ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కుటుంబ పెద్దదిక్కు కళ్లముందే తీవ్రగాయాలపాలుకావడంతో భార్య, పిల్లలు రోధించిన తీరు కలిచివేసింది.

ఆటో బోల్తాపడి ఇద్దరికి..

హిందూపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకంఠపురం కట్టమీద సోమవారం సాయంత్రం ఆటోబోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. లేపాక్షి నుంచి హిందూపురం వైపు వస్తున్న ఆటో శ్రీకంఠపురం కట్టమీదకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో చోళసముద్రానికి చెందిన ఓ మహిళకు, మరొకరికి గాయాలయ్యాయి. వీరిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

హిందూపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణంలోని మేళాపురం, ముద్దిరెడ్డిపల్లిలో రెండిళ్లలో చోరీ జరిగినట్లు బాధితులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముద్దిరెడ్డిపల్లికి చెందిన నారాయణమ్మ అనే మహిళ ఇంటికి తాళం వేసుకుని వేరే ఊరికి వెళ్లింది. సోమవారం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలో ఉన్న రూ.1.30 లక్షలు విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా మేళాపురానికి చెందిన ఆరిఫా ఆదివారం బంధువుల గ్రామానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో ఉన్న వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. వీటిపై బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



దుస్తులను చూపుతున్న క్రీడాకారిణులు

పరిగి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పెన్‌కాక్‌సిలాట్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం ఎంఈఓ లక్ష్మీదేవి దుస్తులు, బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తాను సాయం చేస్తా అన్నారు. శాసనకోట ఉన్నత పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● లక్షలు ఖర్చు చేసి వదిలేసిన వైనం ● పదుల సంఖ్యలో శిథిలం ● పట్టించుకోని అధికారులు





కొడికొండ చెక్‌పోస్టు వద్ద శిథిలావస్థలో ఉన్న ఏపీ టూరిజం భవనం, వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం

చిలమత్తూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలు అందించడం కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటి ఆలనా పాలన లేకపోవడంతో పక్కాగా ఉన్న భవనాలు మట్టిపాలవుతున్నాయి. చిలమత్తూరు మండలంలో ఇలాంటి భవనాలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. గతంలో వాణిజ్య పన్నుల శాఖకు చెందిన కార్యాలయం కొడికొండ చెక్‌పోస్టులో ఉండేది. దాని కోసం ప్రభుత్వం లక్షల ఖర్చు చేసి పక్కా భవనాన్ని నిర్మించింది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమల్లోకి తీసుకురావడంతో ఆ కార్యాలయ నిర్వహణను వదిలేశారు. దాంతో గత 8 ఏళ్లుగా ఈ భవనం మూతపడింది. అప్పటి నుంచి ఈ భవన ఆలనాపాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. లక్షల ఖర్చు చేసిన ఈ భవనాన్ని ఇతర సేవలకు ఉపయోగించుకొని ఉంటే ఉపయోగపడేది. అధికారులు కూడా ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. ఒకప్పుడు కొడికొండ చెక్‌పోస్టుకు ప్రత్యేకంగా నిలిచిన ఏపీ టూరిజం హరిత రెస్టారెంట్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. 2005లోనే రూ.60 లక్షలతో నిర్మించిన భవనం ఇప్పుడు పూర్తిగా శిథిలమవుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే మండలంలో పదుల సంఖ్యలో పక్కా భవనాలు ఆలనాపాలన లేక శిథిలమవుతున్నాయి. కొడికొండ చెక్‌పోస్టులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బలిజపల్లి, నంజిరెడ్డిపల్లి, సుబ్బరావుపేట, ముద్దపల్లి, వై.గొల్లపల్లి, దాదిరెడ్డిపల్లి తండా, మాదిరెడ్డిపల్లి గ్రామాల్లో మూతపడిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖకు సంబంధించిన వసతి గృహాలు, పోలీస్ శాఖకు చెందిన వసతి గృహాలు పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రభుత్వ భవనాలకు ఆలనా పాలన లేకపోవడంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృథా అవుతోంది. భవనాలు కళ్లెదుటే పాడవుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోలేదు. ఆ భవనాలను అలాగే వదిలేయకుండా ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగిస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులైనా ప్రభుత్వ భవనాల వైపు దృష్టిసారించి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి వరం: చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు ప్రధానమంత్రి స్వనిధి పథకం వరంలాంటిదని మున్సిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో లోక కల్యాణ్‌మేళ పథకం ద్వారా చిరు వ్యాపారులు ఈ పథకాన్ని వినియోగించుకోవడంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణంలో 520 మంది వీధి వ్యాపారులు ఉన్నారని అన్నారు. వీరందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్వానిధి 2.0 పథకం అమలయ్యేలా చూస్తామన్నారు. రూ.10వేల నుంచి రూ.50వేల వరకు రుణాలు ఇస్తారని అన్నారు. వీధి వ్యాపారులకు మున్సిపల్ కార్యాలయం వద్దే వైద్యశిబిరం ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్ అంజలి, మెప్మా అధికారి గంగులయ్య, నాయకులు మల్లికార్జునగౌడ్, నాగేంద్రమ్మ, నాగమణి, అయూబ్, గిరీష్, నవీన్, రమేష్‌రెడ్డి, ఆదర్శ్ పాల్గొన్నారు.

రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఈఓ ఉత్తమ్

పావగడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.1200 కోట్లతో పావగడలో వివిధ అభివృద్ధి పనులు జరిగాయని తాలూకా పంచాయతీ ఈఓ ఉత్తమ్ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పావగడ తాలూకావ్యాప్తంగా రూ.1200కోట్ల నరేగా పనులతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. అందులో రూ.800 కోట్ల నిధులతో సక్రమంగా పనులు జరిగాయని, రూ. 400 కోట్లు దుర్వినియోగం కావడానికి కొందరు అధికారులు, గ్రామ పంచాయతీ అధ్యక్షులు కారకులని వివరించారు. తాలూకాలో అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని, దీనికి గ్రామ పంచాయతీ పీడీఓలు, అధ్యక్షులు సహకరిస్తే తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లిఖిత తెలిపారు. సోమవారం కల్లుమర్రి పీహెచ్‌సీ పరిధిలోని మణూర్ గ్రామంలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మాట్లాడుతూ.. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా,బలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాంప్రసాద్, ఆరోగ్య, అంగన్ వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● రొద్దం : మండలంలోని బొక్సంపల్లి, చిన్నమంతూరులో వైద్యాధికారులు స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సోమశేఖర్, రమ్య, భాగ్యలక్ష్మీ, వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు వాణి, పవన్‌కుమార్, సతీష్, నరేష్, తిమ్మయ్య పాల్గొన్నారు.

● సోమందేపల్లి: మండలంలోని కేతగానిచెరువు పాఠశాలలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు ఆయేషా, డీహెచ్ఓ రవీంద్ర, నాయకులు లోకేంద్ర, బాలగోపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

పరిగి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు సోమవారం కొడిగెనహళ్లి గ్రామస్థులు వైద్యులు స్వరూపారెడ్డికి వినతి అందించారు. కొడిగెనహళ్లి, మోదా, మోదా-2, గొరవనహళ్లి, శాసనకోట పంచాయతీలో దాదాపు 30వేల మందికిపైగా జనాభా ఉందని తెలిపారు. వైద్య సేవలు పొందాలంటే పరిగి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. గతంలో హిందూపురం-పరిగి ప్రధానరహదారి పక్కన ఆరోగ్య ఉపకేంద్రం ఉండేదని, అది కూలిపోయి నిర్మానుష్యంగా మారిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు సతీష్, రఘు, కార్తీక్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో డ్రిప్

మడకశిర రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తామని ఏపీఎంఐపీ డివిజన్ అధికారి నరసింహప్ప తెలిపారు. సోమవారం మండలంలోని దేవన్నపాళ్యం, కోనప్పపాళ్యంలోని రైతులకు డ్రిప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నరసంహప్ప మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి డ్రిప్, స్ప్రింక్లర్లు కావలసిన రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఐదు ఎకరాలు లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో, ఆపైన భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ వివరాలు సమీప రైతు సేవా కేంద్రాలో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్‌నెంబర్ 7995010074 కు సంప్రదించాలని తెలిపారు.

నక్కలగుట్టలో పాఠశాల ఏర్పాటు చేయండి

సోమందేపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కలగుట్ట చౌడేశ్వరీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. తమ కాలనీలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో 3 కిలోమీటర్లు వ్యయ ప్రయాసాలకు ఓర్చి సోమందేపల్లి పాఠశాలకు విద్యార్థులు వెళ్లాల్సి వస్తోందన్నారు. దాదాపు 1200 ఇళ్లు ఉండగా.. బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోపాల్‌యాదవ్, ఆంజనేయులు, హనుమంతు, భక్తర్‌వలి, రామాంజనేయులు, ఆచారి, రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగదేవతకు పూజలు

రొళ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మల్లినమడుగు గ్రామం పొలిమేరలో ఉన్న నాగదేవతకు సోమవారం భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టకు పాలు పోసి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో చెన్నకేశవ, సిద్దేశ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.